# దోపిడి! దగా!

బయట ఎండలు మాడిపోతున్నాయి.

మహిళా కళాశాల స్టాఫ్‌రూమ్‌లో లెక్చరర్లందరూ మొన్న జరిగిన ప్రీ ఫైనల్ పరీక్ష పేపర్లు దిద్దటంలో మునిగిపోయి వున్నారు.

ఫైనల్ పరీక్షలు వారం రోజులయితే మొదలవుతాయి.

ఫీజుల పెంపకం, ఎస్సీ ఎస్టీ బీసీలకు ఇచ్చే స్కాలర్‌షిప్పులను పెంచాలంటు, సక్రమంగా ఇయ్యాలంటూ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు చేసిన సమ్మెలతో సిలబస్ సకాలానికి కాక ఈసారి ఫైనల్ పరీక్షలు ఆలస్యంగా జరుగుతున్నాయి.

ఫైనల్ పరీక్షలు మొదలుకాకముందే ప్రీ ఫైనల్ రిజల్ట్స్ విద్యార్థులకందజేయాలె. టైమ్ ఎక్కువలేదు. ఆరోజు నేను కాలేజికి రావటానికి ఆలస్యమైంది. కింద కాలేజీ ఆఫీసులో నన్ను చూడగానే సూపరిండెంట్ పద్మావతి ఇకిలిస్తూ నవ్వింది.

"రిజిస్టరు ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్ళిపోయింది!" అంది.

నేను రిస్ట్‌వాచ్‌లో టైమ్ చూసుకున్నాను. పదిన్నర! పదివరకే స్టాఫ్ సంతకం చేసే రిజిస్టరు ఆఫీసులో వుంటుంది. పదిమీదికి ముల్లు చేరంగనే రిజిస్టరు ప్రిన్సిపాల్ రూమ్‌కు వెళ్ళిపోతుంది. పదివరకు రానివాళ్ళకు ఎర్రగీత పడిపోతుంది. అట్లా మూడు ఎర్రగీతలు పడితే ఓ క్యాజువల్ లీవ్ పోయినట్లే! నేను కాలేజీకి ఆలస్యంగా రావటానికి మా అమ్మ కారణం – గొణుక్కున్నాను మనస్సులో. కాలేజీకని చెప్పులేసుకొని బయలుదేరుతున్నాను. అమ్మ పిలిచింది– "రాధా! పచ్చుళ్ళు పెట్టాల్నే మరిచిపోయావా? ఈ అమావాస్య లోపల పెట్టాల్నె!" అంది పచ్చుళ్ళు పెట్టటానికి టైమ్ లిమిట్ ఏదో వున్నట్లుగా హెచ్చరిస్తూ.

"అమ్మా! మాకు జీతాలు రాక రెండు... మూన్నెల్లయింది.

పచ్చడంటె వేయి రూపాయలైనా కావాలె! మామిడికాయలు ఈ యేడు చాల పిరంగా వున్నాయంటున్నారు. ఐదు రూపాయలకో కాయనట! జీతాలు వచ్చినంక పెడ్దాంలే!" అంటూ దబదబ బయటికి నడిచాను ఎక్కువసేపు ఆగకుండానే.

మా అమ్మ వందకాయల పచ్చడైనా పెడ్తుంది. ఇంతకుముందు రెండొందల కాయలైతేనే ఆమెకు తృప్తి వుండేది. కాని ఇప్పుడెవరంత పచ్చళ్ళు తినకపోవటంతో ఆమె రెండొందల నుంచి వందకాయల పచ్చడి వరకు అతికష్టంగా అసంతృప్తి పడుతూ దిగింది. ఆ వందకాయలయినా ఆవ అల్లం అంటూ రకరకాల పచ్చళ్ళు పెట్టి బంధువులందరికీ పంచటం ప్రతి సంవత్సరం ఆమె పాటించే సంప్రదాయాల్లో ఒకటి! ఆ పచ్చళ్ళ సంభాషణతో ఇంట్లోనే ఆలస్యమైంది నాకు. రోడ్డుమీదికి వచ్చినంక ఆటో దొరకలేదు. ఆటో స్ట్రయికేమో ఆటో చార్జీలు పెంచమని!– అని మనస్సులో ఆటోవాళ్ళను తిట్టుకుంటుండగనే ఓ ఆటో వచ్చి నా ముందల ఆగింది. అట్లా ఆటో దొరక్క కొంత ఆలస్యమైంది. ఒక్క అబద్ధమాడితే వెయ్యి అబద్ధాలాడవలసి వస్తుందన్నట్లుగా ఐదు నిమిషాలు ఇంట్లో లేటయితే కాలేజీ చేరేసరికి అర్ధగంట లేటయింది.

"అయినా గ్రేటర్ హైదరాబాదులో ట్రాఫిక్ జామ్‌లను చూసయినా మా ప్రిన్సిపాలు సంతకం చేసే టైమ్ మారిస్తే బాగుంటుందేమో! ఈసారి స్టాఫ్ మీటింగులో ఈ ప్రస్తావన పెట్టాలె!" – అనుకుంటూ ప్రిన్సిపాలు అర్రల అడుగుపెట్టాను. లేటయినందుకు ఏం మాటలు వినవలసి వస్తుందో అని భయపడ్తూ.

కాని అర్రలోపలికి పోంగనే అక్కడి దృశ్యమంతా విచిత్రంగా వుంది. ఒక పోలీసు ఇన్‌స్పెక్టరేమో ప్రిన్సిపాలుకెదురుగా వున్న కుర్చీలో కూర్చొని వున్నాడు. అతని వెనుక పోలీసు కానిస్టేబుల్ కావచ్చు చేతిలో లాఠీతో నిలబడి వున్నాడు. ఇన్‌స్పెక్టరు పక్క కుర్చీలో ఓ అమ్మాయి. భుజాలమీదినుంచి చునిరీ కప్పుకొని కూర్చొని వుంది. ఇప్పుడు ఆడపిల్లలు చునిరీని నిండుగా ఎక్కడ కప్పుకుంటున్నారు! అలంకారంగా భుజంమీదనో మెడచుట్టానో గుడ్డపేలికగా వేలాడేసుకుంటున్నారు! వక్షస్థలం మీద ఏ అచ్ఛాదనం వుండటం లేదు! ఆ అమ్మాయి కూడా పోలీసేనేమో! కాలేజీ ప్రాంగణంలో ఆటో దిగుతూ 'పోలీసు' అని రాసివున్న జీపు ఆగివున్న సంగతి ఆదరాబాదరాలో వున్న నేను అంతగా పట్టించుకోలేదని నాకు గుర్తు వచ్చింది. "పోలీసులేం చేస్తున్నారిక్కడ?–" అనుకుంటు పక్కటేబిల్ మీదున్న రిజిస్టరు తెరిచాను. ఇంకా నా పేరుకెదురుగా ఎర్రగీత పడలేదు. సంతోషిస్తూ సంతకంచేసి నేను బయటికి వచ్చేసాను. ప్రిన్సిపాల్ నా రాకను పోకను గమనించినట్లే లేదు.

స్టాఫ్ రూమ్‌లో అడుగుపెట్టగానే "కింద ప్రిన్సిపాల్ రూమ్‌లో పోలీసులున్నారు. వాళ్ళల్లో ఓ అమ్మాయి కూడా వుంది" అని అనౌన్స్ చేసాను. "పోలీసా!–" అని అందరు నోర్లు తెరిచారు. పోలీసులెందుకు వచ్చారో ఎవరికి అంతుపట్టలేదు.

ఇంతలో నోటీసు తీసుకొని బాలమ్మ వచ్చింది. బాలమ్మను చూడగానే మీనాక్షి పొలిటికల్ సైన్స్ లెక్చరరు "బాలమ్మా! జీతాలు వచ్చినయటనా?" అని అడిగింది.

దాంతో అందరి దృష్టి జీతాలమీదికి మళ్ళింది. రోజు ఆఫీసుకుపోయి "జీతాలు వచ్చాయా? బ్యాంకులో జమ అయ్యాయా?–" అని అడగటం అందరికీ అయిష్టంగా మారింది. ఎందుకంటె – "ఆఫీసు వాళ్ళు జీతాలను ఏదో తమ జేబుల్లోంచే తీసి ఇస్తున్నట్లుగా మొఖాలు పెట్టి వెంటనే జవాబు ఇయ్యరు". ప్యూన్‌లకయితే తాజా సమాచారాలు తెలుస్తాయని మీనాక్షి బాలమ్మను చూడగానే అడిగేసింది. పోలీసుల సంగతి అందరూ మరిచిపోయారు.

మాది ప్రైవేటే కాని ఎయిడెడ్ కాలేజి కాబట్టి జీతాలు గవర్నమెంటునుంచే వస్తాయి. డైరెక్టగా బ్యాంకులో జమవుతాయి. మాకు రెండు నెలలకు మూడు నెలలకు జీతాలు రావటం మామూలే. ఈసారి రెండు నెలలయిపోయాయి మూడో నెలలోకి వచ్చాం. ఇంకా జీతాలు రాలేదు. లెక్చరరు మీనాక్షి భర్త చనిపోయి నాలుగేండ్లయింది. జర్నలిస్టుగా పనిచేసేవాడు. ఎప్పుడూ కుదురుగా ఒక్క పత్రికలో పనిచేయలేదు. ఎప్పుడూ పత్రిక మేనేజిమెంటుతో అతడు విభేదించేవాడు. తన అభిప్రాయాలు సిద్ధాంతాల మీద నిలబడి పనిచేసేవాడు. చనిపోతూ ఆయన పెన్షన్ అనీ పీ.ఎఫ్ అనీ ఏమీ మిగిలించిపోలేదు. మీనాక్షికి ఇద్దరు పిల్లలు. హైస్కూల్లో చదువుతున్నారు. ఇంటి భారమంతా మీనాక్షి మీదనే. అందుకే జీతం రాకపోతే ఒక్కనెల ఎట్లాగో గడిచిపోతుంది. తర్వాత ప్రతి నెల భారంగానే వుంటుంది. మీనాక్షి బాధలు బాలమ్మకు తెలుసు.

"ఏమొనమ్మ! జీతాలు వచ్చినయని అంటలేరు ఆఫీసుల' బాలమ్మ గొంతులో అసంతృప్తి ధ్వనించింది.

"కొత్తగా డి.ఏ. కూడా అనౌన్స్ చేసారు. దాని జీ.ఓ. కూడా వచ్చిందట. ఈ నెల జీతంలో ఆ డి.ఏ. కూడా రావాలె!" అంది ఎనకమిక్స్ లెక్చరరు మాలతి.

మాకు ఏ సమస్యలున్నా తీర్చటానికి ఎయిడెడ్ కాలేజీ లెక్చరర్ల యూనియన్ అని ఒకటివుంది. మేమంతా అందులో మెంబర్స్మే. ఆ యూనియన్ కార్యవర్గంలో మా కాలేజీ ప్రతినిధిగా ఇంగ్లీషు లెక్చరరు మోనా వుంది. ఆమె ఈ మధ్య యూనియన్ వైస్‌ప్రెసిడెంటుగానూ ఎన్నికయింది.

"ఏం మోనా! నెలనెలా సరిగ్గా రాని జీతాల గురించి యూనియన్ వాళ్ళు ఏం చెయ్యటం లేదేంటి?" కనుబొమలు ముడేసి మోనావైపు చూస్తూ అడిగాను.

"యూనియన్ వాళ్ళు తిరిగితే గద కొత్త డి.ఏ.కు సంబంధించిన జి.ఓ. వచ్చింది తొందరగా! జీతాలు సక్రమంగా నెలనెల ఇయ్యాలని యూనియన్ కార్యవర్గం చీఫ్ మినిస్టర్ని హైయర్ ఎడ్యుకేషన్, హోమ్ మినిస్టర్లను ఈరోజు కలసి మాట్లాడ్తున్నారు. మినిస్టర్లు సరిగ్గా అనుకూలంగా స్పందించకపోతే ఇదిగో వచ్చే పబ్లిక్ పరీక్షల్లో ఇన్విజిలేషన్లు స్పాట్ వాల్యూయేషన్లు బహిష్కరిస్తాం... రిలే హంగర్ స్ట్రైక్ ధర్నాలకు పిలుపునిస్తామని నిర్ణయించారు. టాక్స్ ఫెయిలయ్యాయంటే నిరాహారోద్యమం తప్పదు? ఇదిగో ఈరోజు సాయంత్రం వరకు తెలిసి పోతుంది?–" అంది మోనా లేబర్ యూనియన్ లీడర్‌లా ఆవేశంగా. బాలమ్మ వింటూ అక్కడే కట్టెలా నిలబడిపోయింది.

"బాలమ్మా! మీ యూనియన్ వాళ్ళూ మాతో స్ట్రైక్‌లో కలుస్తామన్నారు. ఏం ఫికర్ పడకు!" అంది మోనా వెంటనే నవ్వేస్తూ దాంతో స్టాఫ్ రూం వాతావరణం మామూలైంది.

"ఏం బాలమ్మా! కింద పోలీసులు వచ్చింద్రట గద! ఎందుకు వచ్చింద్రో నీకు ఎరికేనా?" అడిగింది మిసెస్ ప్రధాన్ ఇంగ్లీషు లెక్చరరు. ఆమె మాతృభాష మరాఠీ. బాంబే యూనివర్సిటీలో ఎమ్.ఏ. చేసింది. పెండ్లయ్యాక డాక్టరు భర్తతో హైదరాబాదులో

స్థిరపడింది. మిసెస్ ప్రధాన్ జిజ్ఞాస చూసి బాలమ్మ మార్మికంగా ఓ చిరునవ్వు మా మీదికి విసిరింది–

"ఆ పిల్లను రేత్రి ఎక్కడ్నో జూబ్లీహిల్స్ రోడ్డంబటి సోయి తప్పి పడివుంటే తీస్కొచ్చింద్రట పోలీసులు. ఎవరు నువ్వంటే గీ కాలేజ్‌ల సదువుకుంటున్ననని చెప్పిందట. అందుకె గిక్కడికి తెచ్చింద్రు పోలీసులు గా పిల్లను!"

"అమ్మో! ఇదేదో తప్పతాగిన కేసులాగుంది... ఈ కాలంలో ఆడపిల్లలేం తక్కువలేరు. వాళ్లూ పబ్బులకు బార్‌లకు మగాళ్ళతో సమానంగా పోయి తాగుతున్నారు. అసలు ఆడ మగ జంటగా లేందే పబ్బులకు ప్రవేశం దొరకదట! ఆ అమ్మాయి ఏ బాయ్‌ఫ్రెండ్‌తోనో పబ్బుకుపోయి తప్పతాగి రోడ్డుమీద పడిపోయి పోలీసులకు దొరికివుంటుంది!–" అమలకూడా ఇంగ్లీషు లెక్చరరే. ఆమెకు ఊహ కల్పనాశక్తి ఎక్కువే. దాన్నంతా ఉపయోగించి దృశ్యాన్నంతా కండ్లకు కట్టేలా వర్ణించి చెప్పింది.

"ఏమోనమ్మ! ఫోన్లమీదనే ఆడపోరీలను సప్లయి చేస్తరంటగద గా కేసంటున్నరు పోలీసులు. గదంత నాకేం ఎర్కలేదమ్మ!" నోటీసు మీద అందరి సంతకాలయినయి. అది తీసుకొని బయటికి వెళ్ళిపోయింది బాలమ్మ. ఆమె వెళ్ళిపోయిందో లేదో నర్సయ్య ప్యూను లోపలికి వచ్చాడు.

"రాధమ్మ! మిమ్మల్ని ప్రిన్సిపాలమ్మ పిలుస్తున్నది" అన్నాడు.

అందరు నావైపు చూపులు తిప్పారు. ఆలస్యంగా వచ్చినందుకు లెక్చరు దంచటానికి ప్రిన్సిపాలు పిలిచిందా ఏమిటి? – అని మనస్సులో భయంతోనే ప్రిన్సిపాలు అర్రల అడుగుపెట్టాను నేను. పోలీసులు, ఆ అమ్మాయి ఇంకా అక్కడనే వున్నారు. నన్ను చూడంగనే ప్రిన్సిపాలు మొఖం మరింత గంభీరమైంది.

"మిస్ రాధ! ఈ అమ్మాయిని చూడండి. మన కాలేజి స్టూడెంటేనా? సరిగ్గా చూసి చెప్పండి?" అంది.

ఆ అమ్మాయిని బాగా పరిశీలిస్తూ చూసాను. నా ఎక్స్‌రే చూపులకు ఆ పిల్ల కొంచెం ముడుచుకపోయింది. చూపుల్లో దైన్యం చోటు చేసుకొని వుంది. మొఖంమీద అక్కడక్కడ గాట్లు వున్నాయి. చెంపలమీద మరీ ఎక్కువగా వున్నాయి. గాట్లు వున్న దగ్గర ఎర్రగా రక్తం గడ్డకట్టుక పోయి వుంది. నెత్తిమీద వెంట్రుకలు చిందరవందరగా వున్నాయి. ఆ పిల్ల కప్పుకున్న గుడ్డ చునిరీలాగా లేదు. మాసిపోయిన బొంత లాగుంది. ఆ పిల్ల మొఖాన్ని మళ్ళా బాగా పరిశీలించి చూసాను.

కాలేజి పాత విద్యార్థినులు ఏ పెండ్లిలోనో ఫంక్షన్లలోనో బజార్లోనో ఎక్కడ్నో కన్పించి "నమస్తే మేడమ్! మేము మీ స్టూడెంట్స్‌మండి. గుర్తుపట్టారా..." అంటారు. అప్పుడు వాళ్ళ మొఖాలు తెలిసినట్లుగానే అన్పిస్తాయి.

"అఁ... అవునవును... మీ మొఖాలు బాగా గుర్తున్నాయి? కాని పేర్లే!... గుర్తులేవు" అంటుంటాను. అట్లా ఎదురుగా వున్న ఆ అమ్మాయి మొఖం తెలిసిన మొఖంలాగానే అన్పించింది.

"అవును!... మన స్టూడెంట్‌లాగానే... వుంది" అన్నాను సాలోచనగా.

"ఏ ఇయర్... ఏ క్లాసో చెప్తారా మిస్ రాధా?" అంది ప్రిన్సిపాలు అధికారం ధ్వనింపజేస్తూ.

ఆ పిల్ల మొఖం వైపు కన్నార్పకుంట చూసాను మరోసారి. ఆ పిల్లమొఖం చిన్నబోయింది.

"ఏమో! మేడమ్!... గుర్తు రావటంలేదు ఏ క్లాసో ఏమో!" అన్నాను. ఇంతలో కూర్చున్న పోలీసాఫీసరు మధ్యలో కల్పించుకున్నాడు.

"మ్యాడమ్! మీరు ఈ అమ్మాయిని పక్క రూమ్‌లకు తీస్కపోయి మాట్లాడండి. మీ కాలేజి స్టూడెంట్‌ననటం తప్ప వేరే వివరాలేమీ చెప్పటం లేదు. మీరు అన్ని వివరాలు ఆ అమ్మాయినడిగి తెలుసుకోండి మ్యాడమ్! ప్లీజ్ హెల్ప్ అజ్ ఇన్ అవర్ డ్యూటీ" అని ఆ పిల్లను పక్క అర్రలకు పొమ్మని చేతితో చూపించాడు.

"మ్యాడమ్! ఆ అమ్మాయిని నిర్బంధించి కొట్టి విషయాన్ని రాబట్టదల్చుకోలేదు. ఆమెను చూస్తే మంచి ఇంటిపిల్లలాగా వుంది! తన అడ్రెసు అదీ చెప్పటం లేదంటె మంచి కుటుంబం కాబట్టే బద్నాం అవుతుందని చెప్పటం లేదని అనుకుంటున్నాం. స్పృహ దప్పిన స్థితిలో తెల్లవారుజామున నాలుగ్గంటలకు ఆ అమ్మాయిని జూబ్లీహిల్స్‌లోని రోడ్డు పక్కన పడివుంటె చూసి పోలీసుస్టేషన్‌కు తీసుకపోయాం. తర్వాత రెండు గంటలకుగాని ఆ అమ్మాయికి స్పృహ రాలేదు. కాఫీ తాగించి నెమ్మదిగా వివరాలు అడిగాం. ఈ కాలేజి స్టూడెంట్‌ననటం తప్ప మరే విషయం చెప్పటం లేదు. నోరు విప్పకుండా శూన్యంలోకి చూస్తున్నది! మీరేమైన ఆ అమ్మాయి అడ్రెసు వివరాలు కనుక్కుంటారని... మీకు తెలుస్తుందోయేమోనని ఇక్కడికి తెచ్చాం. మ్యాడమ్! ప్లీజ్ హెల్ప్ అజ్–" అని వివరంగా విషయాన్ని చెప్పి పోలీసాఫీసరు మళ్ళా నన్ను అర్థించాడు.

నేను పక్క అర్ర లోపలికి పోగానే ఆ అమ్మాయి గౌరవ సూచకంగా కుర్చీలోంచి లేవబోయింది.

"వద్దులే! వద్దు! కూర్చో–" అంటూ నేను పక్కనే వున్న కుర్చీలో కూర్చున్నాను.

ఆ అమ్మాయి మొఖంలో నాకు మునుపటంత టెన్షన్ కన్పించలేదు. అందుకే మొఖం తేటగ కన్పించింది. దాంతో మొఖంమీద గాట్లు మరింత ఎర్రగా దర్శనమిచ్చాయి. గాట్లను నేను పరిశీలనగా చూసాను. అవి మనిషి గోర్లు పండ్లతో గీకి కొరికి చేసిన గాయాలు! నేను పరీక్షగ చూడటం చూసి ఆ అమ్మాయి

"చూడండి మ్యాడమ్!–" అంటూ పైన కప్పుకున్న కంపుకొట్టే బొంతను తీసేసింది. మెడమీద ఛాతీమీద అవే గాయాలు కన్పించాయి. ఆ అమ్మాయి నేననుకున్నట్లుగా పంజాబీ డ్రెస్ దానిమీద చునిరీ వేసుకోలేదు. స్కర్ట్ బ్లౌజు వేసుకుంది. పైన బ్లౌజు అంటె "టాప్" చింపినట్లుగా పేలికలై వేలాడుతున్నది. లోపల బ్రా కనిపించలేదు.

"ఏమిటిదంత!..." షాకయిన నా గొంతులోంచి మాటలు అరచినట్లుగా బయటికి వచ్చాయి.

"అసలు నువ్వు ఈ కాలేజి స్టూడెంటువేనా?" అడిగాన్నేను. నన్ను నేను సంబాళించుకొని.

"నేను దాదాపు ఐదేండ్ల కింద ఈ కాలేజీలో చదివాను మేడమ్..."

అంటే నేను అప్పుడే కాలేజీలో లెక్చరరుగా చేరిన రోజులు! ఆ అమ్మాయిని ఏమైన గుర్తుపడ్తానేమోనని మళ్ళా పరీక్షగా చూసాను.

"...మీరు మాకు రెండు సంవత్సరాలు తెలుగు చెప్పారు. మ్యాడమ్! మీరప్పుడే ఫ్రెష్గా కాలేజీలో చేరారు. నేను బీకామ్ ఈ కాలేజీనుంచే పాసయ్యాను..."

"డిగ్రీ చదివావు మరి ఏమైంది! ఎందుకిట్లయ్యావు! ఏమైన యాక్సిడెంటా?' సానుభూతి ధ్వనించే స్వరంతో అడిగాను.

ఆ అమ్మాయి కండ్లలోంచి కన్నీటిబొట్లు దుమికాయి.

"ఏడ్వకమ్మా! నీ పేరేమిటి చెప్పు!"

"అ... నిత..."

"అనిత!... అంటె నువ్వు రెండేండ్లు కాలేజీ స్టూడెంట్స్ యూనియన్లో కల్చరల్ సెక్రటరీగా వున్నావ్!..." అన్నానేను గుర్తు తెచ్చుకుంటు మెల్లెగా ఆగి ఆగి.

"అవును మేడమ్!-" ఆ అమ్మాయి నోట్లోంచి మాటలు దుమికాయి. కండ్లల్లో ఆనందం మెరుపులా మెరిసింది. "అమ్మాయి అందమైంది!-" అనుకున్నానేను.

"మేడమ్! నన్ను రక్షించండి ఈ పోలీసులనుంచి. నన్ను తీస్కపోయి జెయిల్లో వేస్తారేమో!..." అనిత నా అరచేతిని గట్టిగా నొక్కి పట్టుకుంది. ఆ పిల్ల ఆవేదన నన్ను కదిలించింది.

"ఏం కాదమ్మా! భయపడొద్దు! అసలు జరిగిన విషయమేందో చెప్పు నాకు" నా మరో చేతితో ఆ అమ్మాయి తలమీద నిమురుతూ అన్నాను. కొంచెంసేపు ఏం మాట్లాడలేదు ఏడుస్తూ వుండిపోయింది.

"అనితా! నాకు జ్ఞాపకమొస్తున్నది... నువ్వు ఫైనలియర్లో వుండగా ఏదో సినిమాలో... కొత్తవాళ్ళకు టాలెంట్ టెస్ట్ పెట్టి ఛాన్స్ ఇచ్చారంటు... హీరోయిన్గా వేషం వేసే అవకాశం వచ్చింది! అవునా!... కాలేజంతా ఆ విషయం గుప్పుమంది... అయినా నువ్వు అప్పుడెంత బాగుండేదానివి... అంటె... అందంగా వుండేదానివి! ఇట్లా నల్లగ కాంతి లేకుండ అయిపోయావేంది?... చెప్పు అనితా!... ఏమయింది?..."

ఆ అమ్మాయి చేతితో కన్నీళ్ళు తుడుచుకుంది.

"మేడమ్! బీకామ్ అయిపోయింతర్వాత ఒక సినిమాలో హీరోయిన్గా అవకాశ మొచ్చింది. కాని ఆ సినిమా విడుదలై ఊరుపేరు లేకుండా పోయింది. ఆడలేదు. కొత్త టాలెంట్కు అవకాశమిస్తామన్నవాళ్ళు మాకు డబ్బేం ఇయ్యలేదు. ఆ తర్వాత సినిమా అవకాశాలకోసం చూస్తూ నేనిక్కడే వుండిపోయాను. నా తల్లిదండ్రులు అన్న నాకు పెండ్లి చేస్తామంటే నేను ఎదిరించాను. చేసుకోలేదు. సినిమాలు వద్దు ఏమీ వద్దు అని వాళ్ళు ఊరికి వచ్చేయమన్నారు. నేను పోలేదు. మొండిగా ఇక్కడే వుండిపోయాను. అట్లయితే నువ్వు చచ్చిపోయినవనుకుంటాం అన్నారు అయినా నేను లొంగిపోకుండ సినిమా అవకాశాలకోసం చూస్తూ ఇక్కడే వుండిపోయాను. అందరూ ఏమేమో భయంకరమైన కథలు నాకు చెప్పేవాళ్ళు. అయినా నేను నా అందం టాలెంట్ను నమ్ముకొని ఎన్నడైన

వేషాలు దొరుకుతాయని నా తలిదండ్రులకు అన్నకు దూరంగా ఇక్కడే వుండిపోయాను. వాళ్ళతో నా సంబంధాలు తెగిపోయాయి. నేను మాత్రం సినిమా అవకాశాల మీద ఆశ వదలుకోలేదు. రోజులు... ఏండ్లు గడిచిపోతున్నాయి కాని నాకు అవకాశాలు రాలేదు. ఆఖరికి ఇంటి కిరాయికోసం తిండికోసం చిన్న చిన్న వేషాలు వేయటం మొదలుపెట్టాను. మరో ఇద్దరు జూనియర్ ఆర్టిస్టులతో కలిసి ఓ చిన్న ఇల్లు కిరాయికి తీసుకొని వుంటున్నాను. జూనియర్ ఆర్టిస్టులు బోలెడున్నారు. మాకు చిన్నవేషాలు కూడా కష్టంగానే దొరుకుతాయి. చిన్నవేషం వేస్తున్నప్పుడు నా టాలెంట్ గుర్తించి హీరోయిన్ వేషం ఎవరైనా ఇస్తారని ఆశపెట్టుకున్నాను..." అనిత గంభీరంగా నిశ్శబ్దంలోకి వెళ్ళిపోయింది చెప్తూ చెప్తూ. నేను అనితను చూస్తుండిపోయాను-

"సినిమాల్లో అవకాశాలు కొడుకులకు మనుమలకు వంశపారంపర్యంగా కులవృత్తిగా మారాయి! ఆఖరికి సినిమా తారల కులమొకటి తయారవుతుందేమో- ప్రతిభ తపన వున్నవాళ్ళకు ప్రవేశం దొరకక డిప్రెషన్‌లో కొట్టుకపోవలసిందే! ఆకలితో మాడి చావవలసిందే!-" అనిత తన వృత్తాంతం చెప్పటం మొదలుపెట్టింది. నేను నా ఆలోచనలోంచి బయటికి వచ్చాను-

"మేడమ్! జూనియర్ ఆర్టిస్టుగా వేషం వేస్తే వచ్చే డబ్బు చాల తక్కువ. దానిలో కొంతభాగం మమ్మల్ని వేషాలకు తీసుకపోయే ఏజెంట్ తీసుకునేవాడు. మాకు మిగిలేది మా ఖర్చులకు సరిపోయేది కాదు. వేషాలు లేనప్పుడు మేం పస్తులుండేవాళ్ళం. ఆకలితో మాడిపోతున్న ఓ రోజునే ఆ ఏజెంటు మమ్మల్ని ఓ బాస్‌కు పరిచయం చేసాడు. ఆమె మా సెల్‌ఫోన్ నెంబర్లు తీసుకుంది. పని వున్నప్పుడు ఫోను చేస్తానంది. అయితే మొన్న ఆమె నాకు ఫోను చేసింది - ఒక క్లయింట్ వున్నాడు... చాల డబ్బు వున్నవాడు... హైక్లాసు... పోతావా?... అడ్రెస్ ఇస్తానంది. నేను ఒప్పుకున్నాను. నాకు డబ్బు కావాలి!- కడుపు నిండా తిని ఎన్ని రోజులైంది! బ్యూటీపార్లర్‌కు పోక ఎన్ని నెలలైంది!... నాకు డబ్బు కావాలి!... అందుకే ఆ పనికి ఒప్పుకున్నాను..." అనిత మొఖంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి. గుండెల్లోంచి దుఃఖం తన్నుకొని వస్తున్నది. "ఏడ్వకు అనితా!..." అన్నానేను ఊరడిస్తూ.

"మేడమ్! ఆ రాత్రి అక్కడ నాకు తినటానికి బాగానే దొరుకుతుందని ఆశపడ్తూ పోయాను... కాని అది హోటల్ కాదు.. ఇల్లు!... తిండిని గురించి ఆలోచిస్తూనే లోపలికి పోయాను. ఇంట్లో ఎవరూ లేరు. అతనొక్కడే వున్నాడు. మా అమ్మా నాన్నలు ఊరికెళ్ళారని తనొక్కన్నే వున్నానని చెప్పాడు. నేను ముందుగా తినటానికి ఏమైన పెట్టమని అడిగాను. నవ్వాడు. ఇంట్లో ఎవరూ వంట చేయలేదు అని ఫ్రిజ్‌లోనుంచి బ్రెడ్ జ్యామ్ కొన్ని పండ్లు తెచ్చి ముందు పెట్టాడు. నేను తింటూనే వున్నాను. నన్ను బలవంతంగా బెడ్రూమ్‌లోకి లాక్కొని పోయాడు.

"డోంట్ వేస్ట్ టైమ్!- అని నా మీదికి పులిలాగా దుమికాడు. అర్ధరాత్రి వరకూ అక్కడే వున్నాను. అక్కడ్నుంచి బయలు దేరేముందు "డబ్బు!" అని అడిగాను. హా! డబ్బా!... ఒక పని చేయి రేపు కూడా ఇదే టైముకు రా! మంచి పార్టీ చేసుకుందాం! అప్పుడే నీ డబ్బంతా ఇచ్చేస్తాను... ఇదిగో ఆటోకు... అని యాభై రూపాయలు నా

చేతిలో పెట్టాడు. తిండికోసం డబ్బుకోసం మళ్ళా నిన్న రాత్రి పోయానక్కడికి. ఒక్కడే లేడు. మరో ఇద్దరు స్నేహితులు కూడా వున్నారు. అప్పటికే వాళ్ళముందు డ్రింక్స్ సీసాల గ్లాసులున్నాయి. నన్ను చూడగానే టీనా రా! రా! అన్నాడు. నా పేరు టీనా అని చెప్పాను మొదటిరోజు.

"ఒరే! చూసావా! అమ్మాయిని! అందంగా లేదు! - పాపం! ఆ అమ్మాయికి ఎప్పుడు ఆకలేస్తుంటుంది! ఏమైన పెట్టండిరా! - అన్నాడు నవ్వుతూ. అతని నవ్వు ఏదో విచిత్రంగా అనిపించింది నాకు. అతనితో మిగతా ఇద్దరూ పకపక నవ్వారు. రా! టీనా! రా! మా దగ్గరికి రా! ఏం తింటావ్ బిర్యానీనా? పిజ్జానా? ఏంతింటావ్! అవన్నీ వస్తాయి. ముందు ఈ కోలా తాగు అని ఇచ్చారు. వాళ్ళను చూస్తే నాకు భయంగా వుంది. కాని బయటికి పోయేటట్లు కూడా లేదు! దర్వాజా బంద్ చేసారు. భయపడకు టీనా అది కోలానే! ఏం కాదు తాగు! అన్నాడు నిన్నటతను. నేను కోలా గ్లాసు అందుకొని దబదబ తాగాను.

ఆకలేస్తున్నది. తిందామన్నా అక్కడేం లేదు. ఇంతలో నాకు మత్తుగా అనిపించింది. కోలాలో ఏమైన కలిపారేమో! - మళ్ళా - టీనా! ఏం తింటావ్! బిర్యానీనా? పిజ్జానా? - అంటూ పెద్దగా నవ్వుతూ నన్ను వాళ్ళు తమ ఒడిలోకి లాక్కున్నారు..." అంతవరకు చెప్పి ఆ అమ్మాయి వెక్కి వెక్కి ఏడ్వసాగింది. నేను అవాక్కయి మౌనంగా వుండిపోయాను. కొంచెంసేపు. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకొని "అనితా! తర్వాత ఏమైందో చెప్పు?" అన్నాను - అనిత భుజాలమీదుగా చేయివేసి. నా స్పర్శకు అనిత దుఃఖం ఎక్కువైంది. కొంచెంసేపు అనితను ఏడ్వనిచ్చాను. నేను లేచి కూజాలో వున్న నీళ్ళు గ్లాసులో పోసి అనిత చేతికిచ్చాను. అనిత తీసుకునే స్థితిలో లేదు. నేనే అనిత నోటిదగ్గర గ్లాసుపెట్టి నీళ్ళు తాగించాను. తర్వాత గ్లాసు కిందపెట్టి "అనితా! చెప్పు తర్వాత ఏమైంది?

"మేడమ్! వాళ్ళు ముగ్గురు ఆ రాత్రి నన్ను అనుభవించారు. అన్నం తినక నేను మొదలే నీరసంగా వున్నాను. దానిమీద కోలాపేరుతో ఆల్కహాల్ తాగించారు. దాంతో నాకేం స్పృహలేదు. ఎంత రాత్రివరకు ఎన్నిసార్లు వాళ్ళు నన్ను అనుభవించారో నాకు తెలియదు... నన్ను కార్లో వేసుకొని దూరంగా తీసుకొనివచ్చి రోడ్డుపక్కన పడేసారు. ధమ్మని కింద పడేసిన గుర్తువుంది నాకు! అంతే! స్పృహలో లేను. పోలీసులు నన్ను చూసి పోలీసుస్టేషన్‌కు తెచ్చారు. అదికూడా గుర్తులేదు.

తెల్లారింతర్వాత చల్లని నీటిస్పర్శకు నాకు మెలకువ వచ్చింది. పోలీసులు నా మొఖంమీద నీళ్ళుపోసి పోసి స్పృహలోకి తెచ్చారు. స్పృహలోకి వస్తూనే - దాహం! దాహం! ఆకలి! అంటున్నాను. ఒళ్ళంతా నొప్పులు... తల పేలిపోతున్నట్లుగా నొప్పి! మెల్లిగా కొంచెంసేపటికి లేచి కూర్చున్నాను. పోలీసులిచ్చిన మంచినీళ్ళు కాఫీ తాగాను. తర్వాత చూసుకుంటె ఒళ్ళంతా గాట్లు. మొఖం తడిమి చూసుకుంటె అన్నీ గాట్లు! గాయాలు! ఒళ్ళంతా కత్తులు గుచ్చినట్లుగా నొప్పులు! వాళ్ళ చేతులు పెదవులు నాలుకలు కాళ్ళు శరీరాలు నన్ను తాకుతున్న భయంకరమైన స్పర్శ గుర్తు వచ్చింది. నా ఒంటిమీద పాములు జెర్రులు పాకినట్లుగా అసహ్యం వేసింది. పచ్చిమొద్దుల కింద నలిగిపోతున్న ఊపిరాడని అనుభవం! నా బట్టలు ఊడదీసారు. భయంతో నా శరీరంవైపు చూసుకున్నాను.

చినిగిపోయిన టాప్ స్కర్టులున్నాయి. స్కర్ట్ కింద... తొడలమధ్య రక్తం కారుతుందేమో తడి! గాయమైనంత నొప్పి! కత్తులతో పొడిచినంత నొప్పి! మరోవైపు ఆకలి! దాహం!- పోలీసులిచ్చిన మంచినీళ్ళు కాఫీ సరిపోలేదు. ఆ స్థితిలో పోలీసులు నేనెవరు? ఇల్లెక్కడ? - అని అడిగితే నేను నిజం చెప్పలేకపోయాను.

నా అసలు సంగతి చెప్తే వాళ్ళు నన్ను బతకనియ్యరు!- అని భయం వేసింది. వాళ్ళ ప్రశ్నలకు వణికిపోయాను. నొప్పి! ఆకలి! దాహం! నీరసం - ఆ అర్ధ జాగ్రదవస్థలో నాకు కాలేజీ జ్ఞాపకం వచ్చింది... ఎంత అందమైన రోజులవి! నా చుట్టూ దోస్తులు!... నిశ్చింత!... సంతోషం!... నవ్వులు!... కేరింతలు!... భవిష్యత్తును గురించి తియ్యని కలలు!... ముందున్న జీవితాన్ని తల్చుకొని గొప్ప ఆత్మవిశ్వాసం!... అవన్నీ నా మెదడులో కదిలాయి... ఆ స్థితిలో నేను ఈ కాలేజీ స్టూడెంటునని చెప్పాను. ఎంత అడిగినా మరేం చెప్పలేదు. తలిదండ్రులు అన్నీ గుర్తువచ్చారు. కాని వాళ్ళను గురించి ఏం చెప్పలేదు. వాళ్ళు నన్ను వదులుకున్నారు. చచ్చానని భావించారు. వాళ్ళ గురించి ఏం చెప్తాను! ఇగ ఇప్పుడు నేను ఎక్కడున్నాను ఏం చేస్తున్నాను చెప్తే వాళ్ళు నన్ను మరింత హింసిస్తారు. నాతో వుండే స్నేహితులను వదలరు! ఎప్పటికీ మా వెంట పడ్తారు... అందుకే నన్ను గురించి చెప్పలేదు. నా అడ్రెసు చెప్పలేదు! చెప్తే పూర్తిగా నిరాశ్రయురాలినై పోతాను. ఒంటరిదాన్నైపోతాను. నన్ను చెరిచినవాళ్ళు... సెక్స్ దోపిడి చేసినవాళ్ళు నన్ను దగా చేసినవాళ్ళు ఆర్థికంగా బలమున్నవాళ్ళు. డబ్బుతో దేన్నైనా కొంటారు. ఏం నేరం చేయలేదని నిరూపించుకొని బయటపడ్తారు! నేను వాళ్ళను వెతికి గుర్తించినా వాళ్ళతో నేను ఒంటరిగా పోరాటం చేయలేను. మేడమ్! నాకు తెలుసు... నేనేం చేయలేను!... అంతేగాక నన్ను నేను చంపుకునే పిరికిదాన్ని కూడా కాను!... అప్పుడే మేడమ్! నాకు కాలేజీ గుర్తు వచ్చింది! ఈ కాలేజి స్టూడెంటునని చెప్పాను. దాంతో వాళ్ళు నా మీద అంత జులుం చేయలేదు. కొంతవరకు సానుభూతి చూపారు. ఇక్కడికి తెచ్చారు! మేడమ్! ఎట్లయిన చేసి నన్ను కాపాడండి. ఈ పోలీసుల నుంచి నన్ను కాపాడండి! మళ్ళా ఇటువంటి బుద్ధితక్కువ పని చేయను మేడమ్!..." రెండు చేతులు జోడించి తల వంచుకొని ఏడ్చింది అనిత.

నాకేమనాలో తోచలేదు. అప్పుడు నాకు నా బ్యాగ్‌లో వున్న టిఫిన్ జ్ఞాపకం వచ్చింది. ఇంటినుంచి వచ్చేప్పుడు టిఫిన్లో రెండు దోసెలు కూరుకొని తెచ్చాను మధ్యాహ్నం తినటానికి. బ్యాగ్‌లోనుంచి ఆ టిఫిన్ బయటికి తీసిపెట్టనేలేదు. ఇంతలో ప్రిన్సిపాలు పిలుపు వచ్చింది. తొందరగా బ్యాగ్‌లోనుంచి టిఫిన్ తీసి అనితముందు పెట్టాను.

"అనితా! ముందు ఇది తిను!" అని దోసెముక్క తీసి అనిత నోట్లో పెట్టాను. అనిత ఏడుస్తూనే తినటం మొదలుపెట్టింది. నేను ఆలోచనలో పడ్డాను-

ఇప్పుడు అనిత అసలు సంగతి చెప్తే పోలీసులామెను వదలరు. ఇప్పుడున్న పరిస్థితిలో అనిత తల్లిదండ్రుల దగ్గరికి పోయేటట్లు లేదు. వాళ్ళామెను స్వీకరించరు. ఇంట్లోకి అడుగు పెట్టనియ్యరు. ఇప్పుడెక్కడికి పోతుంది! ఆ పిల్ల తన వెంటాడే కలలను వదిలి రాజీ కుదుర్చుకొని బతగ్గల్గుతుందా? ఏదైన ఉద్యోగం చూసుకొని అందరిలా జీవించగలుగుతుందా? అయినా అనితకు ఇప్పుడు ఉద్యోగం ఎవరిస్తారు. ఈ కాలంలో

ఉద్యోగాలెక్కడున్నాయి! అటువంటప్పుడు అనితకు నేను ఏం సహాయం చేయ గలుగుతాను? - వున్న పరిస్థితులను పరిసరాలను వదిలి ఎక్కడికి రమ్మంటాను? - ఇప్పుడైతే మొదట పోలీసులనుంచి అనితను రక్షించాలె!" అనుకున్నాన్నేను. అనిత భుజాల చుట్టూ ఆ కంపుగుడ్డను కప్పాను. వేరే గుడ్డ ఏం లేదు నా దగ్గర. అనిత చేయి కడుక్కొని మంచినీళ్ళు తాగింది.

"సరే! అనితా! నాతో బయటికి రా!" అని నేను అర్రలనుంచి బయటికి నడిచాను. అనిత మొఖంలో పోలీసులకు నేనేం చెప్తానో అని భయం! నేను ప్రిన్సిపాలు వైపు చూసాను.

"మ్యాడమ్! ఈ అమ్మాయి మన స్టూడెంటే! పేరు - అనిత.

ఇక్కడ్నుంచే బీ.కామ్. పాసయింది. స్నేహితులతో పబ్‌కు పోయిందట. ఇంటికి పోయేటప్పుడు ఓపెన్‌టాప్ జీపులోనుంచి కిందపడిపోయిందట. ఇరికి ఇరికి చాలామంది కూర్చొనివున్నారట. అనిత సీటు చివర కూర్చుని వుందట. జారి పడిపోయిందట. వాళ్ళు చూసుకోకుండా ముందుకు వెళ్ళిపోయారట. ఇంతలో పోలీసు వచ్చి అనితను తీసుకెళ్ళారట. జీపులోనుంచి పడిపోయినప్పుడు అక్కడున్న రాయి తలకు తగిలి స్పృహ కోల్పోయిందట. ఆ స్పృహ దప్పిన స్థితిలోనే పోలీసులు పోలీసు స్టేషన్‌కు తీసికెళ్ళారట. ఇదంతా తల్లిదండ్రులకు తెలిస్తే గొడవ అవుతుంది బద్నాం అయిపోతాను వదిలేస్తే తనే ఇంటికి వెళ్ళిపోతానంటుంది - మన కాలేజీ స్టూడెంట్స్ యూనియన్‌లో అనిత రెండేళ్ళు కల్చరల్ సెక్రటరీగా ఎన్నికైంది. చాలా యాక్టివ్‌గా ఉండేది. మంచి స్టూడెంట్ మీకు గుర్తుందా? మ్యాడమ్-" ప్రిన్సిపాల్‌ను అడిగాను. ఆమె కొంచెం సాలోచనగా చూసింది.

"పేరు అనితనా?... హో! అవునవును... బాగా క్లాసికల్ డాన్స్ చేసేది... అవునవును... నాకు జ్ఞాపకం వచ్చింది! షీ ఈజ్ వన్ ఆఫ్ అవర్ బెస్ట్ స్టూడెంట్స్!-" అంది ప్రిన్సిపాల్ సంతోషం ప్రకటిస్తూ.

నేను పోలీసాఫీసర్ వైపు చూశాను.

"నేను స్టూడెంట్ వెల్ఫేర్ ఇన్‌ఛార్జినండి ఈ అమ్మాయి మా ఓల్డ్ స్టూడెంట్. బెస్ట్ స్టూడెంట్. టాలెంటెడ్ స్టూడెంట్. నేను ఆ అమ్మాయిని భద్రంగా ఇంటికి పంపించే బాధ్యత తీసుకుంటాను. ఆ అమ్మాయి ఈ విషయమంతా తల్లిదండ్రులకు ఎక్కడ తెలుస్తుందోనని భయపడుతున్నది. మరేమీ సంకోచించకండి! ఆ అమ్మాయిని ఇంటికి పంపించే బాధ్యత మాది. సరేనా!-" అన్నాను చిరునవ్వుతో.

"సరే! మీరు చెప్తున్నారు కాబట్టి మేము వెళ్ళిపోతున్నాము. ఆ అమ్మాయిని భద్రంగా ఇంటికి చేర్చండి మ్యాడమ్ వస్తాం! మీ కో-ఆపరేషన్‌కు థ్యాంక్స్!" అని ప్రిన్సిపాల్‌కి చెప్పి పోలీసాఫీసర్ వెళ్ళిపోయాడు. అతనితో లాఠీతో నుంచున్న జవాను కదిలాడు. ప్రిన్సిపాల్ నావైపు చూసి - "మిస్ రాధా! ఆ అమ్మాయి మీ బాధ్యత. ఓకె!-" అని తనముందున్న ఫైళ్ళ కాగితాలమీద సంతకాలు చేయటంలో మునిగిపోయింది.

నేను అనితను బయటకు తీసుకొని పోయాను. "అనితా! నీ భవిష్యత్తు జాగ్రత్త... మళ్ళా ఇటువంటి పనులు చేయకు. నువ్వు సినిమాలో నటించాలని ఆశపడుతున్నావు. నీ ధ్యేయం అదేగా కనిపిస్తున్నది. కాబట్టి నీ ధ్యేయం మరచిపోకుండా సరైన వ్యక్తులతో

స్నేహం చేసి నీ లక్ష్యాన్ని సాధించుకో నీకెప్పుడైనా ఏదైనా సహాయం - డబ్బైనా సరే - కావలసి వస్తే నా దగ్గరికి కాలేజీకి రా! - సరేనా! -" అన్నాను.

"థ్యాంక్యూ వెరీమచ్ మేడమ్! మీ సహాయాన్ని ఎప్పటికీ మరువను. తప్పకుండా నాకేది కావలసినా మీ దగ్గరకు వస్తాను!" అనిత కళ్ళల్లో నీళ్లు నిండాయి. నేను ఆటో మాట్లాడి అనితను ఆటోలో కూర్చోబెట్టాను. నాపర్సులో వంద రూపాయలు మాత్రమే వున్నాయి. అవి తీసి అనిత చేతిలో పెట్టాను "ఇప్పటికి ఉంచుకో..." అన్నాను బరువుగా. అనిత చేతిలో నూరు రూపాయల నోటు చూసుకొని ఆశ్చర్యపోయింది. "మ్యాడమ్! -" అని కన్నీళ్ళు కురిపించింది. ఆటో కదిలింది.

బరువెక్కిన గుండెలతో నేను స్టాఫ్ రూంలో అడుగుపెట్టాను. మోనా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నది ఆఫ్‌చేసి "ఫ్రెండ్స్! రేపటినుంచి మనం స్ట్రైక్‌లోకి వెళ్ళిపోతున్నాము. మనకు జీతాలు సరిగ్గా నెలనెలా రావాలని ఇచ్చిన ఉత్తరాలకు మినిస్టర్లు సరయిన హామిలియ్యలేదు! ఇయ్యకపోవటంతో మన యూనియన్ స్ట్రైక్ చేయాలని నిశ్చయించింది. మనం రేపు ఇందిరాపార్కు దగ్గర జరిగే రిలే హంగర్ స్ట్రైక్‌లో పాల్గొనాలె. అందరూ తప్పక అక్కడికి రండి. అక్కడే తర్వాత పోరాటం ఎట్లా ఏం చేయాలో చెప్తారు! మన జీతాల 'పేమెంట్ సక్రమంగా జరగాలంటె ఈ స్ట్రైక్ తప్ప వేరే మార్గంలేదు. ఎయిడెడ్ లెక్చరర్ల యూనియన్ జిందాబాద్!' తగ్గుస్వరంతోనే అరిచింది మోనా. మేమూ జిందాబాద్! అంటూ పిడికిలి బిగించి చేతులను పైకి లేపాం స్ట్రైక్‌కు మా సమ్మతిని ప్రకటిస్తూ.

"మరి అనిత వంటి వాళ్ళకు ఏ హక్కులు లేవు. ఏ యూనియన్లు లేవు. ఎటువంటి పోరాటాలకు అవకాశం లేదు! -" భారంగా పిడికిలి బిగించాన్నేను.

***-"వార్త" ఆదివారం, 8 జూలై, 2007***